క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించండి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిని రాజ్యలక్ష్మి

పెండ్లిమర్రి : గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారిని రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని నందిమండలం గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఎమైనా పారిశుద్ధ్య పనులు ఉంటే తక్షణం వాటిపై చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

పులివెందుల అర్బన్ సీఐగా నరసింహులు



పులివెందుల రూరల్ : పులివెందుల అర్బన్ సీఐగా నరసింహులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాజంపేట ఎర్రచందనం స్క్వాడ్ నుంచి బదిలీపై ఆయన పులివెందులకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జీవన్ గంగనాథబాబు అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్లారు. అర్బన్ సీఐ నరసింహులు మాట్లాడుతూ పులివెందులలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఏ సమస్యలు వచ్చినా పోలీస్‌స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

శిక్షణకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్స్‌లో యోగా ట్రైనర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్, ఇంటర్నెంట్ ఆఫ్ థింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషన్, వెల్డర్ రిపేరు కోర్సుల శిక్షణకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించడం జరిగిందని.. ఈ కోర్సులకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.తాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు మూడు నెలల శిక్షణ కాలం ఉంటుందని.. పూర్తి చేసిన యువతకు కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.

వరి పంటల పరిశీలన

చింతకొమ్మదిన్నె : మండలంలోని సుగాలి బిడికి, చిన్నకాంపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖ ఏడీ శంకర్ నాయక్ సుగాలిబిడికిలో పడిపోయిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పడిపోయిన వరి పంటను నిలబెట్టి జడల మాదిరిగా కట్టుకోవాలని, లీటర్ నీటికి ఐదుశాతం ఉప్పు ద్రావణం కలిపి వరి పంటపై పిచికారీ చేయాలని, అదేవిధంగా ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున వరి పంటకోతను వర్షం ఆగిపోయే వరకు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఏఓ ఈశ్వర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

మినుము పంట ...

వల్లూరు : మండల పరిధిలోని గోటూరు గ్రామంలో రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన మినుము పంటను ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ వీరయ్య బుధవారం పరిశీలించారు. కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతితో కలిసి ఆయన మినుము పంటను పరిశీలించి పంటలో వైరస్ తెగులు వ్యాప్తి అధికంగా వున్నట్లు గుర్తించారు. పంట దశను బట్టి రసం పీల్చే పురుగుల ఉధృతి నివారణకు ఒక లీటరు నీటికి 0.4 ఎంఎల్ ఇమిడా క్లోప్రిడ్‌ను మరియు 10 గ్రాముల 13- 0- 45 ను కలిపి పిచికారి చెయ్యాలని సూచించారు.

రేపు విద్యుత్ ప్రత్యేక అదాలత్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల, కమలాపురం, వీఎన్‌పల్లె మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సంబంధించి 6వ తేదీ శుక్రవారం జమ్మలమడుగులోని 33 కేవీ సబ్‌స్టేషన్ వద్ద ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నారని ఎర్రగుంట్ల విద్యుత్ ఏడీఈ కిరణ్‌కుమార్, ఏఈ ప్రియదర్శనరెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

దేవుని స్థలాన్ని రీసర్వే చేయించండి

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున ఉన్న వృషభాచలేశ్వరస్వామి దేవస్థానం సంబంధించిన కోట్లు విలువ చేసే స్థలాన్ని రీ సర్వే చేయించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. ఈ మేరకు వేంపల్లెకు వచ్చిన జిల్లా దేవదాయ శాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్‌తో కలిసి దేవస్థానానికి సంబంధించిన 416 సర్వే నంబర్‌లో ఉన్న 70 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవస్థానంలో నాయీ బ్రాహ్మణులను నియమించి స్వామి వారి పూజా కార్యక్రమంలో ఉండేటట్లు చూడాలని కోరినట్లు తెలిపారు. అలాగే ఎద్దులకొండపై అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు, ప్రహరీ గోడ, డ్రైనేజీ, రాజగోపురం వంటి పనులు పూర్తి చేయించాలన్నారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఇక్కడ ఉన్న అన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. దేవస్థాన ఈఓ విశ్వనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన..

- కొందరికి మోదం.. ఇంకొందరికి ఖేదం
- బుడ్డ శనగ రైతుల మోముల్లో ఆనందం
- వరి రైతులకు అపార నష్టం

జమ్మలమడుగు రూరల్ : ఫెంగల్ తుఫాను ప్రభావంతో వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు బుడ్డ శెనగ రైతుకు ఊరట కలిగించగా వరి రైతుకు శోకాన్ని మిగిల్చింది. అక్టోబర్ చివరి వారం, నవంబర్ మొదటి వారంలో రేగడి నేలల్లో జిల్లా వ్యాప్తంగా 72,776 హెక్టార్లలో బుడ్డ శనగను సాగు చేశారు. అప్పటి నుంచి జిల్లాలో వర్షాలు లేవు. శనగ మొక్కలు ఐదు, ఆరు అంగుళాల ఎత్తు పెరిగి వర్షం కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఫెంగల్ తుఫాను పుణ్యామా అంటూ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లో శనగ మొక్కలు నిగనిగలాడుతూ కనిపించడంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లి విరిచింది. మరొక నెల రోజుల పాటు తెల్లవారుజామున మంచు బాగా కమ్మితే ఎకరాకు ఏడు నుంచి ఎనిమిది బస్తాలు దిగుబడి వస్తుందని శనగ రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పడిపోయిన వరి ధరలు..

ఇదిలా ఉండగా వరికి మద్దతు ధరను ప్రభుత్వం కల్పిస్తామని చెప్పినప్పటికి ఆ మేరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో వ్యాపారస్తులే వడ్లను కొనుగోలు చేస్తున్నారు. గత సంవత్సరం క్వింటాలు వడ్లు రూ. 2వేల నుంచి రూ.2600 పలుకగా


పొలాల్లో వరి పంటను ఆరవేస్తున్న రైతు

ప్రస్తుతం రూ.1360 నుంచి రూ.1400 వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం రూ.2300 మద్దతు ధర ఉంటుందని చెప్పినా అమలు చేయక పోవడంతో వరి రైతులు ఇబ్బంది పడుతున్నారు.


వర్షం రాకతో ఏపుగా పెరుగుతున్న శనగ పంట

మద్దతు ధర కల్పించాలి



నాకు సొంత భూమి 2 ఏకరాలు ఉంది. మరో 6 ఏకరాలు కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశాను. ఏకరాకు రూ.40 వేలు ఖర్చు వచ్చింది. వరి పంట చేతికి వచ్చె నాటికి వర్షం పడటంతో దిగుబడి బాగా తగ్గింది. ప్రస్తుతం క్వింటా రూ.1360 కొనుగోలు చేస్తామని వ్యాపారులు వస్తున్నారు. విక్రయించడం వల్ల నష్టం వస్తుంది. రైతులు సాగు చేసిన వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం రూ.2300 మద్దతు ధర ఇస్తామని చెప్పింది. ఆ ప్రకారం కొనుగోలు చేయాలి

– నరసింహ్మారెడ్డి, వరి రైతు, గొరిగెనూర్

శనగ పంట బాగ ఉంది



మాకు ఉన్న 10 ఏకరాల పొలంలో నెల రోజుల క్రితం శనగ పంట సాగు చేశాను. ఫెంగల్ తుఫాను వల్ల వర్షాలు పడటంతో పంట బాగా వచ్చింది. మధ్యలో మరో వర్షం పడితే ఏకరాకు 7 నుంచి 8 బస్తాల దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాను.

– బి. చిన్నమహమ్మద్, రైతు, చిన్నవెంతుర్ల, మైలవరం

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న డాక్టర్ ఐసీ గంగిరెడ్డి ఆసుపత్రి(దినేష్ మెడికల్ సెంటర్)కి శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షనుకు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతో పాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

డ్రిప్ ద్వారా నీటిని అందించాలి

లింగాల : అరటి తోటలలో భూమిలోని తేమ శాతాన్ని బట్టి డ్రిప్ ద్వారా నీటిని అందించాలని అరటి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సునీల్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం తాతిరెడ్డిపల్లె గ్రామంలో అరటి సాగు చేసిన రైతులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అరటిలో సిగటోకా, ఆకుమచ్చ తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అరటిలో ఎగుమతులను ప్రోత్సహించడానికి చేపట్టాల్సిన గెలల యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అత్యధిక మోతాదులో యూరియాను వాడకుండా సిఫార్సు చేసిన మోతాదులో నత్రజని, పొటాష్ ఎరువులను వాడాలని సూచించారు. అలాగే అరటి గెల వేయకముందు మందు పిచికారి చేసిన ప్రతి సారి 10 మి.లీ మినరల్ ఆయిల్/ బనోయి ఆయిల్ లీటరు నీటిలో కలుపుకోవాలన్నారు. మంచి గెల రావడానికి అరటి చెట్టుపై కనీసం 12 ఆకులు ఉండాలని, అనవసరంగా ఆకులు కోయకూడదని తెలియజేశారు. అలాగే


మాట్లాడుతున్న అరటి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త సునీల్‌కుమార్

హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో అరటి గెలలకు తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉండటంవలన గార గెలలపై వస్తోందని, దీని నివారణకు గెలలు వేయకమునుపే పూ మొగ్గలకు ఇంజక్షన్లను వేసుకోవాలని, గెల వేసిన తర్వాత నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4ఎం.ఎల్ లీటరు నీటికి లేదా ఫిప్రోనిల్ 2ఎం.ఎల్ లీటరు నీటికి కలుపుకుని పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సహాయకుడు పవన్ కళ్యాణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు మరింత చేరువ కావాలి

కమలాపురం : పుష్పగిరి కంటి ఆసుపత్రి చేస్తున్న ప్రజా సేవ హర్షణీయం అని, అయితే ఈ ప్రజా సేవ మరింత చేరువ కావాలని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పెద్దచెప్పలిలో భారతి సిమెంట్ కార్పోరేషన్ ప్రైవేట్ లిమిటెడ్(బీసీసీపీఎల్) ఆర్థిక సహకారంతో పుష్పగిరి విట్రియో రెటీనా ఇన్‌స్టిట్యూట్ (పీవీఆర్‌ఐ) కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజల కంటి చూపు పదిలం కోసం పుష్పగిరి, భారతి సంస్థలు చేస్తున్న సేవలు హర్షణీయం అన్నారు. అయితే ఈ సేవ ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. మరిన్ని చోట్ల ఈ కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఎక్కువ మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని ఎమ్మెల్యే సిబ్బందికి సూచించారు. అనంతరం పుష్పగిరి ఆసుపత్రి సిబ్బంది 153 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 83 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. 24 మందికి కంటి శుక్లం శస్త్ర చికిత్స నిమిత్తం కడపలోని పుష్పగిరి కంటి వైద్యశాలకు తరలించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. పుష్పగిరి కంటి వైద్యశాల సిబ్బంది, స్థానిక నేతలు, ప్రజలు పాల్గొన్నారు.


వృద్ధురాలికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో జీతాల బాధలు

వేంపల్లె : జిల్లా వ్యాప్తంగా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లకు ఏప్రిల్ మాసం నుంచి ఈ మాసం వరకు జీతాలు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రొటెక్షన్ వాచర్లకు ఆగస్ట్ నెల నుండి డిసెంబర్ వరకు జీతాలు పడలేదని చెబుతున్నారు. తాము జీతాలపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేక తీవ్ర ఒత్తిడితో ఉద్యోగాలు కొనసాగిస్తున్నామని వారు వాపోతున్నారు. తమను ఆప్కోస్‌లోకి తీసుకుని ఉంటే ఉద్యోగ భద్రత ఉండేదని ప్రభుత్వాలు మారుతున్న తమకు నెల జీతాలు నెల నెలా సమస్యగానే మారిందని ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు తమ సమస్యలను గుర్తించి ప్రతి నెలా జీతాలు పడేలా చూడాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై వేంపల్లె ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యంను వివరణ కోరగా ప్రభుత్వానికి సిఫార్సు చేశామని త్వరలో వారి అకౌంట్లలో డబ్బులు పడేలా చూస్తామని తెలిపారు.

రైతు సమస్యలపై పోరాటం చేద్దాం

జమ్మలమడుగు : రైతు సమస్యలపై పోరాటం చేయడం కోసం మండలంలోని కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పెద్దముడియం మండలం గ్రామ నాయకులు, మండల నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామాలలో రైతుల సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. త్వరలో నీటిసంఘాలకు సంబంధించిన ఎన్నికలు రాబోతున్నాయని ఎన్నికల్లో పోటీ చేయడం కోసం ప్రతి నాయకుడు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని కాబట్టి నీటి సంఘాల ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పోటీలో నిలబడాలన్నారు. గ్రామాలలో ఎటువంటి గొడవలు లేకుండా సామరస్యంగా ఉండాలన్నారు. మైలవరం, కేసీ కెనాల్‌కు సంబంధించిన నీటి సంఘాల పోటీలకు అభ్యర్థులు సర్వం సిద్ధం చేసుకోవాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

రైతులకు అందుబాటులోకి వర్మీ కంపోస్ట్


పాచికలపాడు ఎస్‌డబ్ల్యూపీసీలో వానపాములు వదులుతున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : మండలంలో ఉన్న అన్ని ఎస్‌డబ్ల్యూపీసీల్లో వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం మండలంలోని పాచికలపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీని ఆమె పరిశీలించారు. అందులోని వర్మీ కంపోస్ట్‌లో వానపాములను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించే అన్ని ఎస్‌డబ్ల్యూపీసీలను వినియోగంలోనికి తీసుకువస్తామన్నారు. అన్ని సెంటర్లలో వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు తక్కువ ఖర్చుతో అందించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సర్పంచ్ రామసుబ్బారెడ్డి, ఈఓపీఆర్‌డీ కెజియా పాల్గొన్నారు.

కడప ఉక్కుపై కేంద్ర వైఖరి దారుణం

జమ్మలమడుగు : పార్లమెంట్ సమావేశాలలో ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కడప ఉక్కు సమస్య మా దగ్గర లేదని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అనడం కడప ఉక్కుపైన తీవ్ర వివక్షత స్పష్టంగా కనిపిస్తోందని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో డీవైఎఫ్‌ఐ నాయకులు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి కడప ఉక్కుపైన వివక్షత చూపుతూనే వస్తుందన్నారు. విభజన చట్టంలో కడప ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టాలని ఉన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం నిర్మాణంపై ఆసక్తి చూపకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పార్టీలన్ని ఏకతాటిపైకి వచ్చి కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం అయ్యేవిధంగా పార్లమెంట్‌లో గళం విప్పి సాధించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వరి రైతును ఆదుకోవాలి

చక్రాయపేట : తుఫాను కారణంగా తీవ్ర నష్టాన్ని చవి చూస్తున్న వరి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి కోరారు. వర్షంతో చేతికి వచ్చిన వరి పంట తడిచి మోసులు వచ్చాని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రైతుల పొలాల్లో పంట మొత్తం పడిపోయి కుళ్లిందన్నారు. వరి రైతులను ఆదుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు.


ఖరీఫ్ రైతులు అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలు కోత దశకు చేరుకున్నాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని కృషి విజ్ఞాన శాస్త్రవేత్త ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె, ఉప్పలపాడు గ్రామాలలో రైతులకు సమగ్ర పంటల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు పంటల బీమాకు మూడు రకాలుగా చెల్లించుకోవచ్చునన్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసుకోవడం ద్వారా ప్రీమియం చెల్లించాలి, దానితోపాటు రుణాలు లేని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా చేసుకోవచ్చు. రైతులు ముఖ్యంగా బుడ్డశనగ ఎకరాకు రూ.480, మినుము రూ.285, పెసర రూ.270, నువ్వులు రూ.180, వేరుశనగ రూ.480, జొన్న రూ.315, ప్రొద్దుతిరుగుడు రూ.300 చెల్లించాలన్నారు. రైతులు ఫసల్ బీమాను డిసెంబర్ 15లోగా చెల్లించాలన్నారు. దానితోపాటు వరికి ఎకరాకు రూ.630 చెల్లించి డిసెంబర్ 31వ తేదీ వరకు బీమా చెల్లించుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

వల్లూరు : మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో రఘురాం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో బుధవారం పారిశుధ్యం, తాగు నీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణంపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నీళ్ల నిలువ వుండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల నియంత్రణ చర్యలను చేపట్టాలని, తాగునీటి సరఫరా ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి క్లీనింగ్ చేయాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో రఘురాం

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరులో బుధవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామికి మహిళలు హారతులతోపాటు దీపాలతో స్వాగతం పలికారు. గురువారం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కన్నెలూరు గ్రామ పెద్దలు తెలిపారు.


దీపాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

రైతు బజారును తెరిపించండి

వేంపల్లె : ఐదు మండలాలకు కూడలిగా వేంపల్లె పట్టణంలో ఉన్న రైతు బజారును తెరిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ కోరారు. బుధవారం వేంపల్లెకు వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి గండికోట రాజ్యలక్ష్మిని ఆయన కలిసి మాట్లాడారు. పంచాయతీ ఆధ్వర్యంలో ప్రైవేటు స్థలంలో ఉన్న మార్కెట్‌ను తీసివేసి రైతు బజారుకు తరలించాలని జిల్లా సంయుక్త అధికారి అధితి సింగ్ ఇచ్చిన ఆదేశాలను అమలుపరచాలని కోరామన్నారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి రైతు బజారు తెరిపించేందుకు కృషి చేస్తామని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడపలోనే కొనసాగించాలి

కమలాపురం : కడపలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. బుధవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ప్రాంతం అన్ని విధాల వెనకబడి ఉందన్నారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలో ఉంటే ఈ ప్రాంతం ప్రత్యక్షంగా, పరోక్షంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇతర బ్యాంకులు, ఏపీజీబీలో విలీనం చేసి రాష్ట్రస్థాయి బ్యాంకింగ్ చేయడానికి తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే కార్యాలయాన్ని ఇతర ప్రాంతానికి తరలించడం సరికాదన్నారు. ఆర్థిక శాఖ మార్గదర్శకాల్లో తొలి ప్రాధాన్యత ప్రకారం ఏపీజీబీ రాష్ట్రస్థాయి ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించడమే సరైందని ఆయన అభిప్రాయ పడ్డారు. రాయలసీమ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సూదులను సద్వినియోగం చేసుకోవాలి

సింహాద్రిపురం : ప్రభుత్వం పశువులకు అందిస్తున్న లింగ నిర్ధారిత సూదులను సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని చవ్వారిపల్లెలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా ఉప సంచాలకులు రమేష్ హాజరై 40 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు అందించారు. ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న లింగ నిర్ధారిత సూదులను సద్వినియోగం చేసుకుని త్వరితగతిన 90 శాతం పెయ్యి దూడలు పుట్టించుకుని తద్వారా పశు సంపదను పెంచుకోవాలన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ పులివెందుల ఉప సంచాలకులు మునేశ్వరరావు మాట్లాడుతూ పెయ్యి దూడలలో బ్రూసెల్లా టీకా వేసే కార్యక్రమం, మినరల్ మిక్చర్ వాడటంవల్ల పశువులలో త్వరగా చూలు కట్టడం, పాల దిగుబడి పెరుగుతుందన్నారు. పులివెందుల పశువైద్యశాల డాక్టర్ మహమ్మద్ యూనస్ పశుగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, దూడల సంరక్షణ, పాడి పశువులలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వెటర్నరీ పశువైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ అధికారులు

మినుములో వైరస్ అధికంగా ఉంది

కమలాపురం : మినుము పంటలో వైరస్ తెగులు అధికంగా ఉందని కేవీకే కోఆర్డినేటర్ అండ్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ వీరయ్య తెలిపారు. బుధవారం మండలంలోని మీరాపురం, పాచికలపాడు, చదిపిరాళ్ల గ్రామాలలో సాగులో ఉన్న మినుము పంటను పరిశీలించారు. ఈ పంటలో వైరస్ తెలుగు అధికంగా ఉందన్నారు. పంట దశను బట్టి రసం పీల్చే పురుగుల ఉధృతిని నివారించడానికి ఈవిడాక్లోక్రిడ్ 0.4 మి.లీ. ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే 10 గ్రాముల 13.0.45ను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. బూడిద తెగులు ఆకు మచ్చ తెగులు ఉధృతిని బట్టి హెక్సాకోనోజల్ 2మి.లీ. 10 గ్రాముల 13.0.45 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని ఆయన రైతులకు వివరించారు. అనంతరం సంబటూరు, పాచికలపాడు గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి మాట్లాడుతూ రబీ 2024-25లో పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. సర్పంచ్ రామసుబ్బారెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.


మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త వీరయ్య

అనాథాశ్రమంలో కంటి పరీక్షలు

ముద్దనూరు : మండలంలోని కోడిగాండ్లపల్లె ఏసు కరుణాలయ అనాథాశ్రమంలో బుధవారం మానసిక వికలాంగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రొద్దుటూరుకు చెందిన సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కంటి వైద్యనిపుణులు ఎంఎస్ తేజ పరీక్షలు నిర్వహించారు. శెట్టివారిపల్లెకు చెందిన బసిరెడ్డి స్మారకార్థం ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు సొసైటీ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారెడ్డి తెలిపారు. ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి చెన్నమ్మ, సభ్యులు పాల్గొన్నారు.


అనాథాశ్రమంలో కంటిపరీక్షలు చేస్తున్న వైద్యుడు